క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: 15 ఏళ్లుగా కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని, దీంతో ప్రభుత్వం స్పందించి వెంటనే కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో సీఐటీయూ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జీఓల కాలపరిమితి ముగిసినప్పటికీ వాటిని సవరించకపోవడం దారుణమన్నారు, నేడు అన్ని రకాల నిత్యావసరాల ధరలు పెరిగినందునా ప్రభుత్వం కార్మికులకు వేతనాలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. కాలపరిమితి ముగిసిన అన్ని జీవోలను ప్రభుత్వం తక్షణమే సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 నుంచి జూలై 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఆందోళనల కార్యక్రమాల్లో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, నరసింహారెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీధర్, సుధాకర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయవాది

సంగారెడ్డి టౌన్: చట్టాలపై బాలలకు అవగాహన తప్పనిసరి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్యానల్ అడ్వకేట్ సదానందం అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చట్టాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల అభివృద్ధికి జీవించే హక్కు, చదువుకునే హక్కు, బాల కార్మిక వ్యతిరేక నిర్మూలనపై చట్టాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జాసన్, ముహజిల్, యాదయ్య పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం


తనిఖీ చేస్తున్న విద్యాధికారి గోవిందరాం

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు జిల్లా వ్యాప్తంగా 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నిమిషాల నుంచి సాయంత్రం 5:30 నిమిషాల వరకు జరిగాయని అధికారులు తెలిపారు.

మహిపాల్‌కు డాక్టరేట్ పురస్కారం



డాక్టరేట్ పురస్కారం అందుకుంటున్న మహిపాల్

జోగిపేట(అందోల్): పట్టణంలోని శ్రీసాయి వేంకటేశ్వర హాస్పిటల్ బీఏఎంఎస్ డాక్టర్ పడగంటి మహిపాల్ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నెల 11న ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఇంటర్నేషనల్ వీబీక్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నేషనల్ వ్యాప్తంగా 58 మందికి డాక్టరేట్ పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి ఆరుగురిని ఎంపిక చేశారు. ఇంటిగ్రేట్యూ వైద్య విభాగంలో మహిపాల్‌కు డాక్టరేట్ పురస్కారం ఆయనకు దక్కింది. వీబీక్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ ఫిలెక్స్ ఆప్స్ డీ జాన్ చేతుల మీదగా ఈ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ డాక్టరేట్ పురస్కారం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో దుర్గామాత విగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠాపనను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


2కే రన్‌లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పోలీసులు, ప్రజాప్రతినిధులు

పటాన్‌చెరు: రాష్ట్ర అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఇక్రిసాట్ నుంచి పటాన్‌చెరు మైత్రి మైదానం వరకు తెలంగాణ రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి జెండా ప్రారంభించి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అన్ని రంగాల్లో తెలంగాణ యువత మెరుగైన ప్రతిభ కనబరుస్తోందని తెలిపారు. యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా క్రీడల వైపు దృష్టి మళ్లించాలని విజ్ఞప్తి చేశారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు 2017, 2022లో తన సొంత నిధులతో ఉచిత పోలీస్ శిక్షణ అందించగా 500 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్పనగేష్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎస్పీ భీంరెడ్డి, సీఐలు వేణుగోపాల్‌రెడ్డి, వినాయక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి లాలునాయక్, ప్రవీణ్‌రెడ్డి, వేణుకుమార్, శ్రీనివాసులురెడ్డి ఎస్‌ఐలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే రన్


జోగిపేటలో 2కే రన్ ప్రారంభిస్తున్న అధికారులు


జహీరాబాద్: 2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, పోలీసు అధికారులు


నారాయణఖేడ్‌లో..

జహీరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జహీరాబాద్ పట్టణంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ 2కే రన్ నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి ఎంఆర్‌హెచ్‌ఎస్ స్కూల్ వరకు తెలంగాణ 2కే రన్ చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ రంగుల బెలూన్‌లు వదిలి తెలంగాణ రన్‌ను ప్రారంభించారు. అడిషనల్ డీఆర్‌డీఓ జయదేవ్, డీఎస్పీ రఘు, సీఐలు భూపతి, వెంకటేష్, ఎస్‌ఐలు శ్రీకాంత్, పరమేష్, కాశీనాథ్, వినయ్, దేకొండలు, సురేష్, తహశీల్దార్ స్వామి, ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జోగిపేటలో తెలంగాణ రన్‌ను సోమవారం ఉదయం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లయ్యలు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి అందోలు వద్ద ఉన్న ఆర్డీఓ కార్యాలయం వరకు రన్ కొనసాగింది. పోలీసుశాఖ ఆధ్వర్యంలో టీషర్టులను పంపిణీ చేశారు. సీఐ నాగరాజు, ఎస్‌ఐ సామ్యానాయక్, ఎంపీడీఓ సత్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మాణయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, టీచర్లు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు రన్‌లో పాల్గొన్నారు. పీఆర్‌టీయూ కార్యదర్శి నరోత్తం, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు గోపాల్‌రావు, వెంకట్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: తహసీల్ గ్రౌండ్‌లో డీఎస్పీ వెంకట్ రెడ్డి సోమవారం 2కె రన్ ప్రారంభించారు. పట్టణ ప్రధాన రహదారుల గుండా నిర్వహించిన రన్ తిరిగి తహసీల్ గ్రౌండ్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, నాయకులు రమేశ్ చౌహాన్, విజయ్‌బుజ్జి, నగేశ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనానికి మరమ్మతులు చేపట్టాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలోని అంబేడ్కర్ భవనం దెబ్బతిన్నందునా మరమ్మతులు చేపట్టాలని యువజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రవి, నర్సింలు మాట్లాడుతూ మాణిక్‌ప్రభు వీధిలో 50 సంవత్సరాల క్రితం నిర్మించిన అంబేడ్కర్ భవనం దెబ్బతిని పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయని తెలిపారు. శిథిలావస్థకు చేరడంతో చిన్నపాటి వర్షం పడినా భవనం కురుస్తుందన్నారు. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పందిస్తూ వెంటనే మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులకు ఫోన్ చేసి భవనం మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు శ్రీనివాస్, ఆశోక్, శివకుమార్, సాగర్, మోహన్, గోపాల్, రాజు, సాయి, జగన్, లాలప్ప పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కోహీర్(జహీరాబాద్): బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు మనోహర్, మండల ఉపాధ్యక్షులు మధుకర్, మహిళా మోర్చ అధ్యక్షురాలు నింగమ్మ, దిగ్వాల్ వార్డు సభ్యులు శివకుమార్, జహీరాబాద్ ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షులు రాజు తదితరులు ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షులు ఉమర్ అహ్మద్, మాజీ పట్టణ అధ్యక్షులు ఇఫ్తెకార్, నాయకులు సవూద్ పాల్గొన్నారు. జంగం గోపి ముఖ్య అనుచరుడైన మనోహర్ 2019 పార్టీ మండల అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు తీసుకున్నారు. మూడు నెలల క్రితం బీజేపీ పదవికి రాజీనామా చేశారు.

అధికారుల గైర్హాజరుపై చర్యలు తీసుకోవాలి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


మాట్లాడుతున్న జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ఎంపీపీ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ మమత అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు మండిపడ్డారు. సమావేశాలకు హాజరుకాని అధికారులు, సకాలంలో విచ్చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశంను కోరారు. నాలుగేళ్ల క్రితం గ్రామాల్లో తాగు నీరు అందించామని, ట్యాంకర్ల బిల్లులు నేటికీ అందలేదని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. బెల్టు షాపుల్లో సిట్టింగ్‌లను అరికట్టి గ్రామాల్లో గొడవలు జరగకుండా చూడాలని సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఎక్సైజ్ ఎస్‌ఐ రమేష్‌ను కోరారు. అదేవిధంగా వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఈ ముకిద్‌ను కోరారు. భూ సమస్యల పరిష్కారానికి ధరణిలో దరఖాస్తు చేసి నెలల తరబడి రైతులు నిరీక్షిస్తున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని సభ్యులు సభకు వివరించారు. ఎంపీటీసీలు సర్పంచ్‌లు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్ సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రభులు, ఏపీఓ విష్ణువర్ధన్, ఎంపీఓ ప్రభాకర్ రెడ్డి, ఏఓ అభినాష్‌వర్మ, డాక్టర్లు హర్షవర్ధన్‌రెడ్డి, జ్యోతి, ఏఈలు శశికుమార్, తాహా, సంధ్య, ఏపీఎం నర్సింలు, ఆత్మ, పీఏసీఎస్ చైర్మన్‌లు విఠల్, నాగిశెట్టి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు శివకుమార్ పాటిల్, మొగులప్ప, వీణారాణి, పండరి, నవనీత, లక్ష్మి, నర్సింలు, నరేష్, ప్రవీణ్‌కుమార్, హన్మంతు, నాగార్జున, మైపాల్‌రెడ్డి, సంతోష్ పాటిల్, శంకర్, అధికారులు కీర్తికృష్ణ, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ గ్రామ శివారులో ఎమ్మెన్నార్ ఆస్పత్రి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి తీగలు ప్రమాదకరంగా అల్లుకున్నాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

మునిపల్లి(అందోల్): కంకోల్ బీజీనేస్ స్కూల్ యజమాన్యం కంకోల్ గ్రామానికి చెందిన పలువురు రైతుల భూములను తిరిగి ఇప్పించాలని కోరుతూ తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర నాయకులు రమేశ్ యాదవ్ సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ కంకోల్ గ్రామానికి చెందిన వడ్డే ఎల్లమ్మకు చెందిన సర్వే నంబర్ 236 ఇ 30 గుంటల భూమిని బిజినెస్ స్కూల్ యజమాన్యం కబ్జా చేసిందని ఆరోపించారు.

అందూర్‌లో ఘనంగా బోనాలు


బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని అందూర్ గ్రామంలో సోమవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బోనాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ ఖదీర్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్‌టికెట్ల పంపిణీ


హాల్‌టికెట్లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ బస్వరాజ్

జహీరాబాద్ టౌన్: పాఠశాలకు గుర్తింపులేని కారణంగా టెన్త్ ఎగ్జాం రాయలేక పోయిన 8 మంది విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాధికారి బస్వరాజ్ విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపులేదు. గతంలో గుర్తింపు ఉన్నా రిన్యూవల్ చేసుకోకపోవడంతో పదో తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థుల వద్ద పరీక్ష ఫీజులు వసూలు చేసి బోర్డుకు చెల్లించలేదు. దీంతో వారు పరీక్షలు రాయలేదు. ఈ విషయం ఎంఈఓ ఉన్నత అధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లగా ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, విద్యాశాఖ కమిషనర్ దేవసేనా, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు స్పందించి విద్యార్థుల భవిష్యత్ దెబ్బతినకుండా ఉండేందుకు అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంఈఓ బస్వరాజ్ 8 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని సిద్దార్థ హైస్కూలో సెంటర్‌లో విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు.

చెత్తాచెదారాన్ని తొలగించాలి


రోడ్డు పక్కన పారబోసిన చెత్త

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మున్సిపాలిటీ చెత్తను శివారు గ్రామాల ప్రాంతాల్లో పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కులబ్‌గూర్ గ్రామ వార్డు మెంబర్ కృష్ణ అన్నారు. సోమవారం గ్రామ పరిధిలో చెత్త వేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపాలిటీకి డంపింగ్ యార్డ్ లేకపోవడంతో తీవ్ర సమస్యలు ఎదరవుతున్నాయన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలించే అవకాశం ఉన్నందునా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రెండేళ్ల క్రితం డంప్యాడ్ సమస్యతో ఒక సంవత్సరం పాటు కులబ్‌గూర్ గ్రామంలోని నల్ల చెరువులో చెత్తను అక్రమంగా పారబోశారని తెలిపారు. ఈ విషయమై ప్రశ్నించిన గ్రామస్తులకు, పాలకవర్గానికి గ్రామ అభివృద్ధికి కోటి రూపాయలు ఖర్చు చేసి పనులు చేస్తామని అప్పటి మున్సిపల్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హామీనిచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఆరుట్ల పరిధిలో వేస్తున్న చెత్తను అక్కడి ప్రజలు ఆపివేయడంతో తిరిగి డంపింగ్ యార్డ్ సమస్య ఏర్పడిందన్నారు. దీంతో సంగారెడ్డి మున్సిపల్ అధికారులు రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా శివారు ప్రాంతాల్లో రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో చెత్తను పారబోస్తున్నారన్నారు. వీరి ప్రయత్నాలను మానుకోకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు చెత్తను పారబోసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ దండు అంజయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని నంబర్ వన్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగించుకోవాలని సూచించారు.ఈ నెల 20వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాల్లో ఘనంగా విద్యా దినోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, సీఆర్పీ రాజేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ దశరథ్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎంతమంది విద్యార్థులను బడిలో చేర్పించారనే వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఖమ్రొద్దిన్, ఇమ్రాన్, గోపాల్, వినయ్‌కుమార్, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మేలు జాతి దూడల ప్రదర్శన

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని గోవిందరాజుపల్లి గ్రామంలో సోమవారం కృత్రిమ గర్భాధారణతో పుట్టిన మేలు జాతి దూడలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి సంధ్యారాణి మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు మేలుజాతి దూడలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పశువులకు నట్టల నివారణ మందులు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో సర్పంచ్ సరిత ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

12పిటిసి11-350053: నోటు పుస్తకాలు, బ్యాగులను అందజేస్తున్న నాయకులు

పాఠశాల పరిసరాలు శుభ్రత

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని పరిసరాలను స్థానిక నాయకులు సోమవారం శుభ్రం చేశారు. సర్పంచ్ నర్సింహారెడ్డితో పాటు స్థానిక నాయకులు పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించటంతో పాటు పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేసి చెత్తచెదారాన్ని తొలగించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, బడీడు పిల్లలు బడుల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను సర్పంచ్ కోరారు.

రేపు జాబ్‌మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కార్యాలయంలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి వందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెరీటస్ ఫైనాన్స్‌లో ఏదైనా డిగ్రీ పాసైన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 10 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వేతనం రూ.13000 నుంచి 20వేల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 14వ తేదీన విద్యార్హత సరిఫికెట్లతో ఉదయం 11గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 084552701010 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకుర్ మండల పరిధిలోని బొమ్మరెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు రాందాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో మూడో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉచిత హాస్టల్ వసతి సదుపాయం ఉందన్నారు. అదేవిధంగా 3 నుంచి 9వ తరగతి వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని, గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు సోమవారం ఎంఈఓ బస్వరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందకుండా అడ్మిషన్‌లు తీసుకుంటున్నారని తెలిపారు. విద్యాధికారులు స్పందించి గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు చంద్రకాంత్, అఖిల్, శ్రీకాంత్, లోకేష్, రాహుల్, సందీప్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

జహీరాబాద్: పట్టణంలో అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు సోమవారం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఫీజుల దోపిడీని అరికట్టాలని, అనుమతి లేని పాఠశాలలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని కల్బగూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆకుల జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని రకాలుగా ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంను ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో విద్యార్థుల నమోదు పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

మనూరు(నారాయణఖేడ్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించారు. లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, జిల్లా ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, నారయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్సై లక్ష్మణ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.9,49,473 వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. పూజారులు శ్రీకాంత్ స్వామి, సిద్దుస్వామి, నాగయ్యస్వామి, శ్రీకాంత్ రెడ్డి, రమేశ్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

వరి కొనుగోళ్లు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న అధికారులు

కంది(సంగారెడ్డి): వరిధాన్యం కొనుగోళ్లు ఈ నెల15వ తేదీ వరకు పూర్తి చేయాలని డీఎస్ఓ వనజాత, డీసీఓ తుమ్మ ప్రసాద్ అన్నారు. సోమవారం కందిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందునా ధాన్యం తడిసిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, టీడీసీఎస్ సురేష్, సీఈఓ శ్రీధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తి

రాయికోడ్(అందోల్): భక్తితోనే ముక్తి లభిస్తుందని బర్దిపూర్ ఆశ్రమ పూజ్య 108 వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ భక్తులకు ఉపదేశించారు. సోమవారం మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో విగ్రహాల ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు.